# కథ

# సందేశం

**కాకాని కమల**

**సుందరమ్మది మధ్యతరగతి సంసారం.**

**ఇంటెడు పనీ ఆవిడే చేసుకోక తప్పదు.**

**అయితే అందరితోటి తను ఎంతో కష్టపడిపోతున్నానని అస్త మానం కనిపించిన వాళ్ళందరికీ తను సంసారానికి ఎంత చేస్తున్నదీ.. రకరకాల రోగాల్తో ఎలా బాధలు పడిపోతున్నది ఏకరువు పెడుతుంది.**

ఆవిడకి వుండే సుఖాలు, ఆనందాలు ఆవిడకి సంసారంలో వున్నాయి.

జీవితం అన్నాక కష్టం, సుఖం రెండూ తప్పవు కదా?

కానీ సుందరమ్మ కష్టాలే అందరి ముందు ఏక రువు పెడుతూ ఉంటుంది.

దగ్గర్లో ఒక గుడి ఉంది.

తరచూ ఆ గుడికి వెళ్ళి ''ఏం దేవుడో.. నాకేం అర్థం కావటం లేదు. నాకు మాత్రం అన్నీ సమస్యలే'' అంటూ తను కుటుంబం గురించి పడుతున్న కష్టాలు పూజారిగారికి చెప్పుకునేది.

★ ★ ★

ఒకరోజు సుందరమ్మ బజారుకి వెళ్ళి రెండు సంచీల్నిండా కూరగాయలు కొని మోసుకొని వస్తోంది.

దారిలో సంచులు చెయ్యిజారి కూరలన్నీ కిందపడిపోయాయి.

ఆ సమయంలో రోడ్డుమీద జనం లేరు. ఉన్న కొద్దిమంది కూడా వారి మానాన్న పడిపోయ్యారేగానీ సుందరమ్మకి సహాయపడలేదు.

రోడ్డుమీదంతా దొర్లిన ఆ కూరలన్నీ సుంద రమ్మ ఒక్కర్తే ఏరుకుని సంచీల్లో నింపి ఇంటికి వచ్చింది.

వయసు మళ్ళుతున్నది కావటంతో నడుం నొప్పి పెట్టి రెండురోజులు యాతనపడింది. ఎవరన్నా నడుంకి ఇంత బామ్ మసాజ్ చేస్తే బాగుణ్ణు అనుకుంది.

కానీ ఎవరు చేస్తారూ?

పిల్లలు అంతా ఎవరి మానాన్న వాళ్ళు ఉద్యోగాలకి, చదువులకి పోయారు.

నాలుగు రోజులకి నడుంనొప్పి తగ్గింది సుంద రమ్మకి. కానీ ఆ విషయం కనిపించిన అందరికీ తెగ చెప్పుకునేది.

ఆఖరికి గుడికి వెళ్ళి పూజారిగారికి కూడా ఏక రువు పెట్టింది తన నడుంనొప్పి గురించి, కూర గాయలు రోడ్డుమీద ఒలికిపోయిన సంగతి గురించి.

ఈమెని ఎల్లాగైనా మార్చాలి, జీవిత సత్యాలు తెలిసేలా చెయ్యాలి అనుకున్నాడు పూజారి.

అంతలో కొత్త సంవత్సరం వచ్చింది.

పూజారిగారు తన అసిస్టెంటు పూజారి కుర్రాడ్ని పిలిచి దేముడి ప్రసాదం, అందమైన రంగురంగుల పెద్ద గులాబీల గుత్తిని సుందర మ్మకి కొత్త సంవత్సరం శుభాకాంక్షలతో పంపించాడు.

ఆ గులాబీలన్నీ గుడిమాన్యం తోటలోవి.

అరచేతి వెడల్పుతో అన్ని రంగుల గులాబీలతో కట్టిన ఆ పుష్పగుచ్ఛం ఎంతో అందంగా వుంది.

ఆ గులాబీల గుత్తిని చూస్తూనే సుందరమ్మ తెగ ఆనందపడిపోయింది.

అయితే ఆ గుత్తి మధ్య వున్న ఒక వాడి ముల్లు సుందరమ్మ చేతికి గుచ్చుకొని కాస్త నెత్తురు చిమ్మింది.

చాలా బాధ కలిగింది.

కానీ ఆ అందమైన అద్భుత రంగుల గులాబీలని చూస్తుంటే ఆ బాధని క్షణంలో మర్చిపోయింది.

ఆ మర్నాడు గుడికి వెళ్ళినప్పుడు- ''పూజారి గారూ! కొత్త సంవత్సరానికి మీరు పంపిన దేముడి ప్రసాదం, గులాబీల గుత్తి చాలా అందంగా వున్నాయి. కానీ మీరు ఒక ముల్లు విరచటం మర్చిపొయ్యారు. అది నా వేలికి గుచ్చుకొని చాలా బాధించింది. రక్తం కూడా వచ్చింది. కానీ ఆ గులాబీల అందం చూస్తూ మైమరచిపోయాను. మరికొన్ని ముళ్ళుంటే జాగ్రత్తగా నేనే కత్తిరించాను. ఆ తరువాత పూల కూజాలో గులాబీల గుత్తిని పెట్టాను. ఎంత అందంగా ఉన్నాయో ఆ పూలు'' అంది.

పూజారి చిరునవ్వుతో అన్నాడు.

''గులాబీలు బాగున్నాయి కదా?''

''చాలాచాలా బాగున్నాయి. కాని ఆ ముళ్ళే...ఇబ్బంది పెట్టాయి'' అంది తన సహజ గుణంతో.

''కావచ్చు. కాని ఆ పూల అందాలకి మురిసి పొయ్యారా లేదా? ముందు ఆ విషయం చెప్పండి సుందరమ్మగారూ'' అన్నాడు పూజారి.

''రంగురంగుల గులాబీల అందం గురించి ప్రత్యేకించి వేరే చెప్పటానికి ఏముంది. కానీ మీరు ఆ ముళ్ళు విరిచేసి పంపితే బాగుండేది... అవి నన్ను గుచ్చి బాధించకుండా వుండేవి'' అంది.

అప్పుడు పూజారి ఇలా అన్నాడు.

''చూడండి సుందరమ్మగారూ! స్థిమితంగా నామాట వినండి. ఆ ముళ్ళు మిమ్మల్ని గుచ్చాయి. వాటిని కూడా తీసేసి మీకు నేను పంపిస్తే బాగుండేది. కాని ఆ ముళ్ళు విరచటం నేను మర్చిపొయ్యానని మీరు అనుకుంటున్నారు. అవునా?'' అన్నాడు.

''అవును. ఖచ్చితంగా అదే అనుకుంటున్నాను. మీరు ముల్లు విరచటం మర్చిపో...''

పూజారి మధ్యలోనే ఆమె మాటకి అడ్డం వస్తూ అన్నాడు.

''కాదు. నేను మర్చిపోలేదు. వాటిని ఉద్దేశ్య పూర్వకంగానే వుంచాను'' అన్నాడు.

''అవునా? ఎందుకు?'' అంది సుందరమ్మ ఆశ్చర్యంగా.

''ఎందుకంటే ఆ ముళ్ళని మీరే విరిచేసి ఆ పూల అందాల్ని ఆనందించాలని. ఈ సందేశం మీకు ఇవ్వాలనే ముళ్ళతో వున్న గులాబీల అందాల పూలగుత్తిని మీకు పంపించాను. గులాబీ ఎంత అందాల పూలరాణే అయినా దానికి కూడా ముల్లు పక్కనే వుంటుంది. జీవితం గులాబీల గుత్తి లాంటిది. అప్పుడప్పుడూ ఆ ముళ్ళని జాగ్రత్తగా విరిచి గులాబీ అందాలని ఆనందించాలి. అప్పుడే ముళ్ళున్న ఆ పూలు ఎంతో ఆనందాన్ని కలిగిస్తాయి.

అలాగే జీవితం కూడా. అందరికీ సమస్యలు, ఇబ్బందులు ఉంటాయి. ఎవ్వరి జీవితమూ ముళ్ళులేని గులాబీల పాన్పు కాదు. కష్టాలు, సమస్యలు ఆ ముళ్ళలాంటివి. అవి బాధించినా, వాటిని విరిచేసి పూల అందాలని ఆనందించినట్లు జీవితంలో సమస్యలు, ఇబ్బందులు మరిచిపోయి జీవితాన్ని ఆనందించాలి. నేను ఎవరి



కోసం

కష్టపడుతున్నాను. నా పిల్లల కోసం, నా ఇంటి కోసం, నా భర్తకోసం. నా భర్త సంపాదిస్తు న్నాడు. నేను ఇల్లు నడుపుతున్నాను. మేం ఇద్దరం కలిసి పిల్లల్ని అభివృద్ధిలోకి తెస్తున్నాం. ఇది ఎవరికోసమో కాదు- మా కోసమే, మా ఆనందం కోసమే కదా? అనుకోవాలి. మీకీ జీవిత మాధుర్యం తెలియాలంటే ఇతరుల మీద నేరాలు మోపటం, మీరొక్కరే కష్టపడిపో తున్నాను అనుకోవటం, మీ కష్టాన్ని ఎవరూ గుర్తించటం లేదు అనుకొని మీపై మీరు సాను భూతి చూపించుకోవటం మానే సినప్పుడే సాధ్యం అవుతుంది. జీవితం భగవంతుడి ప్రసాదం'' అన్నాడు.

కొద్దిసేపు సుందరమ్మ మాట్లాడ లేదు.

ఆ తరువాత పశ్చాత్తాపం ధ్వనించే స్వరంతో ఇలా అంది సుందరమ్మ.

''ఇప్పుడు నాకు జీవిత సత్యం అర్థం అయ్యింది పూజారిగారు. జీవితం గులాబీల పూల పాన్పే. కానీ ప్రతి గులాబీకి ముళ్ళు వుంటాయి. ముళ్ళు ఓపిగ్గా విరిచేసుకోవాలి. కొత్త సంవత్సరానికి ముళ్ళున్న అందాల గులా బీల గుత్తిని, దేముడి ప్రసాదాన్ని పంపి- దాని ద్వారా నాకు మంచి సందేశం అందించారు. కృత జ్ఞురాల్ని పూజారిగారూ'' అంది రెండు చేతులు జోడించి తృప్తిగా చూస్తూ.

ఆరోజు తరువాత ఎప్పుడూ ఎవ్వరితోనూ తనేదో కష్టపడిపోతున్నట్లు మాట్లాడలేదు సుందరమ్మ.

పూజారిగారి సందేశం ఒక్క సుందరమ్మ కేనా?